విశాలాంధ్ర
అనకాపల్లి
గురువారం 25, జూలై, 2024



గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి

విశాలాంధ్ర - రావికమతం: గత పాలకుల నిర్లక్ష్యంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. బుధవారం మండలంలో జి.చీడిపల్లి గ్రామంలో మండల కార్యదర్శి జోగిరాజు ఆధ్వర్యంలో సమితి సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆగస్టు 6న నర్సీపట్నంలో జరుగు జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు, గ్రామాల అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామాల వారీగా శాఖ సమావేశాలు నిర్వహించి సమస్యలపై దృష్టి సారించి సంబంధిత శాఖల అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని ఆయన సూచించారు. అనంతరం భూ సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్ క్రాంతి కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు శివలంక కొండలరావు, మండల సమితి సభ్యులు సేనాపతి శ్రీను, కొత్తపల్లి జోగారావు, బుంగ కుమారి, పార్టీ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జ్వర పీడితులను పరామర్శించిన జెడ్పీటీసీ

విశాలాంధ్ర - గొలుగొండ: సీజనల్‌గా వస్తున్న వ్యాధులు పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జెడ్పీటీసీ సుర్ల వెంకటగిరి బాబు తెలిపారు. జ్వరాలతో బాధ పడుతున్న ఎస్.కంటారం పంచాయతీ పరిధిలో గల అడ్డలోవ, సుద్ధలపాలెం గ్రామాల్లో జ్వర బాధితులను ఆయన పరామర్శించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వేడి నీటిని త్రాగడం వల్ల జ్వరాలు రాకుండా ఉంటాయని అన్నారు. అత్యవసరమైతే దగ్గరలో ఉన్న చీడిగుమ్మల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సేవలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎం.ఎల్.హెచ్.పి హెల్త్ అసిస్టెంట్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాములను కలెక్టర్ తనిఖీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అనకాపల్లి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం పక్కనే ఉన్న ఈవీఎం వేర్హౌస్ నందు భద్రపరిచిన ఈవీఎం మిషన్లను బుధవారం ఉదయం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్థానిక అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. నెలవారి తనిఖీలలో భాగంగా తనిఖీ నిర్వహించారు. సిసి కెమెరాల పనితీరు, ఇతర పరిస్థితులను గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా భద్రతాపరమైన చర్యలు గురించి తెలుసుకొని, అప్రమత్తంగా ఉండాలని అక్కడ అధికారులను ఆదేశించారు. అనంతరం లాగ్ బుక్‌లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి వై. శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో ఇంటి దొంగలు

- అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు బాటలు
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - పరవాడ: ప్రభుత్వం మద్యం అమ్మకాలు చేపట్టినప్పటి నుంచి గ్రామాల్లో మొబైల్ బెల్ట్ షాపులు ఎక్కువయ్యాయి. 'ఇంటి దొంగలను ఈశ్వరుడైనా పట్టుకోలేడు' అనే నానుడి మద్యం దుకాణాల వద్ద సిబ్బందికి అతికినట్లు సరిపోతుంది. మండంలలోని పలువురు ఉద్యోగులు తమ తెలివితేటలతో అడ్డదారుల్లో అక్రమ సంపాదనకు బాటలు వేశారు. మద్యం అమ్మకాలు, స్టాక్ నిల్వలు అన్ని వారి చేతుల్లో ఉండడంతో అక్రమ సంపాదనకు హద్దులు లేకుండా పోయాయి. చివరికి మద్యం షాపుల నైట్ వాచ్‌మెన్‌ల చేత మద్యం అమ్మకాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొందరు నైట్ వాచ్‌మెన్‌లు నిత్యం రాత్రుళ్లు కాపలా కంటే అక్రమంగా మద్యం అమ్మడంలోనే బిజీబిజీగా ఉంటారు. ఒకప్పుడు కరోనా లాక్‌డౌన్ సమయంలో కూడా మధ్యాహ్నం వరకే దుకాణాల వద్ద మద్యం అమ్మకాలు జరిగాయి. దీంతో రాత్రి వేళ మందుకు డిమాండ్ ఉండేది. వారి కోసం సదరు ఉద్యోగులే కొంతమంది టీమ్‌తో మొబైల్ మద్యం దుకాణాలను ప్రారంభించారు. స్కూటర్లపైనే అడిగిన వారికి మద్యం సరఫరా చేసేవారు. మద్యాన్ని లెఫ్ట్ చేసి రహస్య ప్రాంతాల్లో స్టాక్ చేసుకుని తమ దందాను కొనసాగించేవారు. గత ప్రైవేట్ మద్యం దుకాణాల సిబ్బందితో కలిసి ఈ దందాకు తెరతీసారు. కరోనా సమయంలో ఒక్క పరవాడలోనే లక్షల్లో లాభాలు పంచుకున్నట్లు అప్పట్లో ఆరోపణలు ఉన్నాయి. అయితే ఇప్పుడు కూడా రూ.150, రూ.200 ఉండే మందు కేసులు వచ్చిన గంటల వ్యవధిలోనే అమ్ముడు పోతున్నట్లు దుకాణంలో చెబుతున్నారు. వాటినే స్కూటర్లపై రూ.50 నుంచి రూ.100 అదనంగా బ్లాక్‌లో అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాలకు మందు అవసరమైన కేసుకు రూ.1000 అదనంగా తీసుకుని సరుకు అందిస్తారని మందుబాబులే చెబుతున్నారు. ఇక్కడి నుంచి కొందరు ఎక్సైజ్ అధికారులకు కూడా మామూళ్లు వెళుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పరవాడలో మద్యం దుకాణాల ఉద్యోగులే బహిరంగంగా బెల్టుషాపులకు తరలిస్తున్నారన్న విమర్శలు కూడా లేకపోలేదు. వాడచీపురుపల్లి, దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం, మంత్రిపాలెం మద్యం దుకాణాల ఉద్యోగులు కూడా తన బంధువుల చేత మద్యం అమ్మిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బ్రాండెడ్ మద్యం కావాలన్నా.. వీరు క్షణాల్లో సరఫరా చేస్తారని పలువురు మందుబాబులు పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా సెబ్ అధికారులు దాడులు చేసిన సందర్భాలు ఎక్కడా కనిపించలేదు. పైగా గతంలో అక్రమాలకు పాల్పడుతూ పట్టుబడ్డ ఉద్యోగలను తొలగించినట్లు తొలగించి తిరిగి అదే సిబ్బందిని అధికారులు నియమించడం పట్ల అనేక ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక పోలీసుల ప్రవర్తన కూడా భిన్నంగానే ఉంది. గతంలో మాదిరిగా అక్రమ మద్యంపై ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఎల్లవేళలా నిత్యం కేసులు నమోదు చేసిన పోలీసులు కూడా ప్రస్తుతం వదిలేయడంతో ఉద్యోగుల అక్రమ సంపాదనకు అడ్డేలేకుండా పోయింది.

గంజాయి కేసులో ముద్దాయికి జైలు శిక్ష

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: గంజాయి కేసులో ముద్దాయి నీలకాయల మోహన్‌కు 4 సంవత్సరాల 5 నెలల కారాగాల శిక్షతోపాటు వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య తీర్పు వెల్లడించారు. 2020 జనవరి 24న పరవాడ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన సమాచారం మేరకు ఎస్సై గోపి వారి సిబ్బందితో ఉదయం 06.30 గంటలకు లంకెలపాలెం జంక్షన్ వద్ద అనుమానాస్పద వ్యక్తి బ్యాగ్‌ను తగిలించుకుని వెళ్ళుచుండగా పోలీసులను చూసి తప్పించుకునే క్రమంలో పట్టుబడ్డాడు. బ్యాగ్‌ను తనిఖీ చేయగా 4 కేజీలు గంజాయి లభ్యమయింది. అతనిని విచారించగా తన పేరు నీలకాయల మోహన్ అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన వ్యక్తినని తెలిపాడు. దీంతో మధ్యవర్తుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని, పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి అదే రోజున ముద్దాయిని అరెస్ట్ చేసి, దర్యాప్తు పూర్తి చేయగా ఎస్సై రమేష్ న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారన్నారు.

తదుపరి విచారణ పూర్తయిన తర్వాత అనకాపల్లి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ముద్దాయి నీలకాయల మోహన్‌కు 4 సం.ల 5 నెలలు కారాగార శిక్ష , రూ.1,000/- జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో పి.పి వడ్డాది వెంకట్రావు వాదనలు సమర్థిస్తూ 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు ఈ తీర్పును వెల్లడించింది. ఇదిలా ఉండగా సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరిచి నిందితుడికి శిక్ష పడే విధంగా చర్యలు తీసుకున్న దర్యాప్తు అధికారి ఎస్సై గోపి, పీ.పీ వడ్డాది వెంకట్రావు, స్టేషన్ సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ఎం.దీపిక అభినందించారు.

అయ్యంకి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - నర్సీపట్నం: గ్రంథాలయోద్యమం ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి తోడ్పాటు నందించిన గొప్ప వ్యక్తి, స్వతంత్ర్య సమరయోధుడు, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య అని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కె.త్రిమూర్తులురెడ్డి కొనియాడారు. బుధవారం నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో జరిగిన వెంకట రమణయ్య 134వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చదువు అభివృద్ధికి మూలం అని గ్రహించి అందరూ చదువుకోవాలని అందుకు గ్రంథాల యాలు అవసరమని భావించి దేశమంతా గ్రంథాలయాల ఏర్పాటుకు కృషిచేసిన ఆద్యుడు వెంకట రమణయ్య అన్నారు. గ్రంథాలయాలను కేంద్రాలుగా చేసుకుని స్వాతంత్ర్య పోరాట యోధులను తయారు చేశారన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలలో గ్రంథాలయ మహాసభలు నిర్వహించారన్నారు. అనకాపల్లి శారదా గ్రంథాలయం కూడా అందులో భాగమన్నారు. అనంతరం విశ్రాంత ఫిజికల్ డైరెక్టర్ పి.ప్రభాకర్ మాట్లాడుతూ అయ్యంకి వారి త్యాగనిరతిని కొనియాడారు. ఇదే రోజు తల్లిదండ్రుల దినోత్సవం కాబట్టి ఆ విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ప్రారం భంలో గ్రంథాలయాధికారిణి పి.దమయంతి స్వాగతం పలికి చివరలో వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చదవరులు పాల్గొన్నారు.

కశింకోట: తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి

వెంకటరమణయ్య 134వ జయంతి వేడుకలు గ్రంథాలయాధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముం దుగా అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూల మాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు అయ్యంకి వెంకట రమణయ్య జీవిత చరిత్ర అను అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో బుధవారం గ్రంథాలయోద్యమ పితామహుడుగా పేరుపొందిన అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి వేడుకలను చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంధాయాలధికారి కె.జనార్ధన్

ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి జనార్ధన్ మాట్లాడుతూ ప్రజలకు గ్రంథాలయాలను చేరువ చేయడంలో అయ్యంకి కృషి వెల కట్టలేనిదన్నారు. గ్రామీణులకు ప్రపంచంలో ఏ మూల ఏమి జరుగుతుందో తెలుసుకునే భాగ్యం గ్రంథాలయాల ద్వారానే కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అప్పలరాజు, పాలూరి బుల్లి వెంకటరావు, సిబ్బంది వి.రమణమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతిని బుచ్చయ్యపేట మండల కేంద్రంలోని స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథ పాలకులు వి.కృష్ణారావు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమకారుడుగా, పాత్రికేయునిగా, గ్రంథాలయాల ఏర్పాటుకు అయ్యంకి వెంకటరమణయ్య

చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర - కోటవురట్ల: శ్రీ సత్య సాయి ట్రస్ట్ వారి సౌజన్యంతో కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులకు ట్రస్ట్ ప్రతినిధులు బుధవారం ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఏ ఒక్క పేద కుటుంబానికి చదువు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికీ ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేయడమే శ్రీ సత్యసాయి ట్రస్ట్ వారి సంకల్పమని ట్రస్ట్ ప్రతినిధి కాళ్ల శ్రీనివాసరావు అన్నారు. బోడపాలెం ఎంపీపీ స్కూల్ ఇతర పలు ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయులు బోధిస్తున్న విద్యాబోధనను శ్రద్ధగా అవగాహన చేసుకొని ప్రతి ఒక్కరు ఉన్నత స్థానాలకు చేరాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం కొడవటిపూడి ఎంపిటిసి సూర్యప్రకాష్, సర్పంచ్ కోసూరి అప్పారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్దెల కృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కే.వెంకటాపురం మాజీ ఎంపీటీసీ కాళ్ళ మాతి నాయుడు, కొడవటిపూడి గ్రామ యువత ప్రతినిధి ప్రసాద్, శ్రీ సత్యసాయి ట్రస్ట్ ముఖ్య అతిథి శెట్టి విశ్వనాథం, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాంప్రదాయ క్రీడలతో మానసిక ఉల్లాసం

విశాలాంధ్ర - కే.కోటపాడు: సాంప్రదాయ క్రీడలతో విద్యార్థులకు మానసిక ఉల్లాసం కలగడమే కాకుండా శారీరిక దారుఢ్యం కలుగుతుందని మండల విద్యాశాఖ అధికారి 2 డివిడి ప్రసాద్ అన్నారు. నూతన విద్యా విధానంలో అవగాహన కల్పించుటలో భాగంగా ఈనెల 22 నుండి 28వ తేదీ వరకు ప్రభుత్వ ఆదేశాలతో మండలంలో ఉన్న అన్ని పాఠశాలల్లో సాంప్రదాయ ఆటలు ఆడిస్తున్నట్లు తెలిపారు. బుధవారం చౌడువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులచే అష్టా చమ్మ, చదరంగం, వైకుంఠపాళీ తదితర పాతకాలం నాటి ఆటలు ఆడించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 మాట్లాడుతూ ఈ ఆటల వలన విద్యార్థుల్లో ఏకాగ్రత పెరగడం, మంచి ఆలోచన శక్తి కలుగుతుందన్నారు. విద్యార్థులు ఆటల్లో గెలుపోట ములు సాధించడం ద్వారా భవిష్యత్తులో వారు నిజజీవితంలో ఎదురయ్యే సమస్యలు పరిష్క రించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వి.త్రినాధరావు, సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెదబాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - కశింకోట: అనకాపల్లి నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ (పెదబాబు) పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు గొంతిన చిరంజీవి, మాజీ సర్పంచులు కర్రి దుర్గునాయుడు, మజ్జి సూర్య ప్రకాష్, మండల టీడీపీ అధికార ప్రతినిధి జెర్రిపోతుల నూకునాయుడు, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షుడు మజ్జి విక్రమ్ కుమార్, ఉప్పులూరి అప్పలనాయుడు, కోర్ కమిటీ సభ్యులు తెరపల్లి శ్రీను కేకు కట్ చేసి పూల బొకే ఇచ్చి శాలువతో సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అచ్చర్ల గ్రామ టీడీపీ అధ్యక్షులు నాయినంశెట్టి రమణారావు, తాళ్లపాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు ఉల్లింగుల రమేష్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఆంద్రా ప్రసాద్‌లు పెదబాబును సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాణి సేవగ్ నారిపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన బోడపాటి శివదత్

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ పలువురి కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో ఉన్న పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవవరపు రఘు తల్లిని, ఇటీవల తండ్రిని కోల్పోయిన అరట్లకోట జనసేన పార్టీ సర్పంచ్ పులగపూరి అప్పలనర్సని, కాలుకు సర్జరీ చేసుకున్న నక్కపల్లి జన సైనికుడు రాజు కుమార్తెని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా సంయుక్త కార్యదర్శి కే.అప్పలరాజు, విక్కి స్వామి, పాము గణేష్, చంద్రరావు, సత్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

సామూహిక లక్ష్మి గణపతి హోమం, మహా అన్నదానం

విశాలాంధ్ర - చోడవరం: రాష్ట్రంలోని స్వయంభూ దేవాలయాలన్నింటిలో చరిత్ర ప్రసిద్ధి చెందిన అనకాపల్లి జిల్లా చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం ఆషాఢ బహుళ చవితి, సంకట హర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులచే సామూహికంగా లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. వేకువ జామునే కార్యసిద్ధి గణపతి స్వామికి పురుష సూక్త విధానంలో పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, నారికేళ ఫలములతో వివిధ అభిషేకములు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కోరిన వరాలు ఇచ్చే దేముడు కాబట్టి ఇక్కడి స్వామిని కార్యసిద్ధి గణపతి అని భక్తులు పిలుస్తుంటారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచలి షణ్ముఖ శాస్త్రి (శ్రీనివాస్), కార్యనిర్వహణాధికారి ఎస్.వి.వి.సత్యనారాణ, వివిధ గ్రామాలు , పట్టణాల నుండి విచ్చేసిన భక్తులు, దంపతులు పాల్గొన్నారు.

వరి నాట్లు ప్రారంభం

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు వరినాట్లు సిద్ధం చేసి ఉడుపులు ప్రారంభించారు. సకాలంలో వర్షాలు కురిసాయని, దీనివలన ఎంతో మేలు జరుగుతుందని రైతులు అంటున్నారు.

జాతీయ రహదారిపై కారు బోల్తా

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో ధర్మవరం జాతీయ రహదారిపై కారు బోల్తా పడింది. వివరాల్లోకెళ్తే విశాఖపట్నం నుండి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ధర్మవరం వద్ద కారు అదుపు తప్పి డివైడర్ పైకి దూసుకు పోయి బోల్తా పడింది. అయితే కారులో నలుగురు వ్యక్తులు ప్రయాణం చేస్తున్నారు. కానీ ఎటువంటి గాయాలు అవలేదు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలలో బుధవారం విద్యార్థులకు పలు రకాల ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో కర్ర బిళ్ళ, వైకుంఠపాళీ, తొక్కుడు బిళ్ళ, గాలిపటాలు, నాలుగు స్తంభాలాట, నేల బండ, వామన గుంటలు, రాముడు సీత తదితర ఆటలు పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారి కేఎన్ గాంధీ తెలిపారు.

బుచ్చయ్యపేట: మండలంలోని సీతయ్యపేట హైస్కూల్లో శిక్షా సప్తాహ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం గరపాటి విష్ణు మాట్లాడుతూ శిక్షా సప్తాహ్ వేడుకలు ముఖ్య ఉద్దేశ్యం పిల్లలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టి నాలుగు సంవత్సరాలు గడిచిన సందర్భంగా శిక్షా సప్తాహ్ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడలను నిర్వహించారు. స్కూల్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

పూడిమడక సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండలంలో మత్స్యకార గ్రామమైన పూడిమడక సచివాలయంలో బుధవారం ఆధార్ స్పెషల్ డ్రైవ్ క్యాంప్ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది వెల్ఫేర్ అసిస్టెంట్ సంధ్య, మహిళా పోలీస్ రేవతి, డిజిటల్ అసిస్టెంట్ మొహిద్దిన్ ఆధ్వర్యంలో డి.చిరంజీవి ఆధార్ అప్డేట్ నిర్వహించారు. న్యూ ఎన్రోల్మెంట్ 10తో కలిపి 37 మందికి సేవలు అందించినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. ప్రభుత్వమే నిర్వహిస్తున్న ఈ ఆధార్ అప్డేట్ కార్యక్రమాన్ని ఎంపీడీవో కే.సురేష్ కుమార్ పర్యవేక్షించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ నియమకానికి దరఖాస్తు

విశాలాంధ్ర - యలమంచిలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల యలమంచిలిలో 2024-2025 సంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ నియమకానికి దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీలో పీజీ కోర్సులు బోధించడానికి ఇద్దరు లెక్చరర్స్, కంప్యూటర్ సైన్స్, యూజీ కోర్స్ బోధించడానికి ఒక లెక్చరర్ అవసరమని అన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో 55 శాతం, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ లేదా ఎంసీఏలో 55 శాతం మార్కులు వచ్చి నెట్ లేదా పీహెచ్‌డీ కలిగినటువంటి అభ్యర్థులు తమ సర్టిఫికెట్స్‌తో 26వ తేదీన కళాశాలలో హాజరు కావలసినదిగా కోరారు.